క్లుప్తంగా

ఘనంగా శివపార్వతుల కల్యాణం

భారీగా తరలివచ్చిన భక్తులు



కల్యాణోత్సవంలో భక్తులు

తాండూరు టౌన్: భావిగి భద్రేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం శివపార్వతుల కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. శివదీక్షా సేవాసమితీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చారు. దేవతామూర్తుల విగ్రహాలతో భాజాభజంత్రీల నడుమ ఊరేగింపుగా ఆలయానికి వచ్చారు. ఈ కల్యాణంలో శివుడి తరపున బొప్పి శ్రీహరి, శిరీష, పార్వతీదేవి తరపున రాకేష్, శ్రావణి దంపతులు కల్యాణం జరిపించారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ వేడుక అత్యంత వైభవంగా జరిగింది.

గృహప్రవేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ



గృహప్రవేశంలో ఎమ్మెల్సీ పట్నం

తాండూరు రూరల్: మిట్టబాసుపల్లి గ్రామంలో పట్లోళ్ల నర్సింహారెడ్డి నూతన గృహప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి పాల్గొని నర్సింహారెడ్డికి శుభాకంక్షాలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు ఇస్మాయిల్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వడ్డె శ్రీను, నాయకులు అబ్దుల్ రవూఫ్, హరీశ్వర్‌రెడ్డి, విశ్వేశ్వర్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, పెద్ద ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

శోభాయమానంగా విగ్రహ ప్రతిష్ఠాపన



మల్లికార్జున స్వామి పూజాకార్యక్రమంలో భక్తులు

కుల్కచర్ల: ఇప్పాయిపల్లిలో రెండురోజులుగా జరుగుతున్న మల్లికార్జున స్వామి విగ్రహ పునః ప్రతిష్ఠాపన కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం స్వామి విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తజనుల మధ్య మహోత్సవాన్ని జరిపారు.

మల్లికార్జునుడి చెంతకు శివభక్తుల పాదయాత్ర



ఇరుముడులతో పాదయాత్రగా శివభక్తులు

దోమ: శ్రీశైలం మల్లికార్జునుడి చెంతకు పాదయాత్రగా శివ మాలధారులు ఆదివారం బయలుదేరి వెళ్లారు. మండల పరిధిలోని కొండాయపల్లిలో గ్రామానికి చెందిన శివ భక్తులు శివాలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు ఇరుముడులు కట్టుకొని శ్రీశైలం పుణ్యక్షేత్రానికి పాదయాత్రగా వెళ్లారు.

హైదరాబాద్ సీపీకి సన్మానం



సీపీ శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న పద్మశాలీ సంఘం నాయకులు

షాద్‌నగర్: పట్టణంలోని క్రిష్టియన్ కాలనీలో గల మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు ఒగ్గుకిషోర్ స్వగృహానికి వచ్చిన హైదరాబాద్ కమిషనర్ ఆఫ్ పోలీస్ శ్రీనివాస్‌ను ఆదివారం పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పూలబొకేను అందజేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో షాద్‌నగర్ ఏసీపీ కుషాల్కర్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలకు మోటారు బహూకరణ

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం లాల్ పహాడ్ కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థులకు తాగునీటి సౌకర్యం కోసం గుంజల్‌పహాడ్ గ్రామానికి చెందిన కృష్ణ సింగిల్‌ఫేజ్ మోటార్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా ఆదివారం ఎమ్మెల్యే తనయుడు మురళీ చేతుల మీదుగా పాఠశాల ప్రత్యేకాధికారి రాగసుధకు మోటార్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె దాత కృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు. టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సయ్యద్ హఫీజ్, నాయకులు అంజయ్య, రాములు, బాబురావు, జబ్బార్, నర్సింగ్‌రావు, రామచంద్రయ్య, వెంకటేశ్ పాల్గొన్నారు.

కాలినడకా కష్టమే..

స్వాతంత్య్రం వచ్చి ఏడున్నర దశాబ్దాలు గడుస్తున్నా.. నేటికీ సరైన రోడ్డు మార్గం, విద్యుత్ సౌకర్యాలకు పల్లెలు నోచుకోవడం లేదు. ఇందుకు కోట్‌పల్లి మండలం ఎన్కెపల్లి రోడ్డు మార్గమే సాక్ష్యం. పూర్తిగా కంకరతేలి అధ్వానంగా మారిన ఈ రహదారిపై వాహనాలు కాదుకదా.. కనీసం కాలినడకనా వెళ్లలేని పరిస్థితి నెలకొనడం.. పాలకుల పనితీరుకు నిదర్శనం.

- అధ్వానంగా ఎన్కెపల్లి లింకు రోడ్డు
- ప్రమాదాల బారిన వాహనదారులు
- ఏళ్లతరబడి తిష్టవేసిన సమస్య
- పట్టించుకోని పాలకులు, అధికారులు



ఎన్కెపల్లి లింకు రోడ్డు దుస్థితి

బంట్వారం: కోట్‌పల్లి మండల పరిధిలోని ఎన్కెపల్లి లింకు రోడ్డు అధ్వానంగా మారింది. జిన్నారం గేటు నుంచి ఎన్కెపల్లి మీదుగా బంట్వారం, తొర్మామిడి, కర్ణాటకలోని కుంచారం వెళ్లే వారికి చాలా సులువుగా ఈ మార్గం ఉండేంది. ప్రస్తుతం రోడ్డు పూర్తిగా పాడవడంతో చుట్టూ తిరిగి తమ గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. ఈ రోడ్డుకు మరమ్మతులు చేస్తే వాహనదారులకు సౌకర్యంగా ఉంటుందని, దారి కంకరతేలి ఉండడంతో ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి వాహనదారులు కిందపడుతున్నారు. ఇలా నిత్యం జరుగుతున్న ప్రమాదాలతో ఈ రోడ్డులో పయణించాలంటేనే జంకుతున్నారు.

సగం వరకే పనులు

కంకర తేలిన ఈ లింకు రోడ్డుకు ఏడేళ్ల క్రితం సగం వరకే మెటలింగ్ పనులకు నిధులు మంజూరయ్యాయి. బడ్జెట్ ఉన్నంత వరకు అప్పట్లో పనులు చేశారు. మిగతా సగం అలాగే వదిలేశారు. నాడు చేసిన సగం పనులు కూడా ధ్వంసం కావడంతో పరిస్థితులు మొదటికొచ్చాయి. ప్రసుత్తం కంకర తేలి కాలి నడకన కూడా వెళ్లలేని దుస్థితి నెలకొంది. అత్యవసర సమయంలో ఎన్కెపల్లికి అంబులెన్స్ కూడా సకాలంలో చేరుకోవడం లేదని, చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తుందోని గ్రామస్తులు వాపోయారు. సమస్యను పలు మార్లు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీరాజ్ అధికారులు స్పందించి రహదారి నిర్మాణానికి తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నిధులు మంజూరు చేయాలి



లింకు రోడ్డుకు సత్వరమే మరమ్మతులు చేపట్టాలి. ప్రభుత్వం ఇందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలి. ఏళ్ల తరబడి సమస్య ఉన్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. కంకర తేలడంతో కాలినడకన కూడా వెళ్లలేకపోతున్నాం.

– లక్ష్మయ్య, ఎన్కెపల్లి

ప్రతిపాదనలు పంపిస్తాం

మెటిలింగ్, బీటీరోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తాం. ఎన్కెపల్లి పంచాయతీ నుంచి తీర్మానం చేయాలి. త్వరలోనే రోడ్డును పరిశీలించి, నిర్మాణానికి చర్యలు చేపడతాం.

– జితెందర్‌రెడ్డి, డీఈ, పీఆర్

రోడ్లపైనే మురుగు ప్రవాహం



రోడ్డుపైనే ప్రవహిస్తున్న మురుగు

- పట్టించుకోని అధికారులు, పాలకులు
- రోగాల బారిన ప్రజలు

ధారూరు: దోర్నాల్ గ్రామం పరిసరాలు అపరిశుభ్రతకు నిలయంగా మారాయి. నిధుల కొరత సాకుతో అంతర్గత రోడ్లకు ఇరువైపులా పక్కన మురికికాల్వలు నిర్మించలేకపోతున్నామని కార్యదర్శులు చెబుతుండగా.. రోడ్లపై మురుగు నీరు ప్రవహిస్తోందని, తద్వారా దుర్వాసనతో పాటు దోమలు పెరిగి రోగాల బారిన పడుతున్నామని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పల్లె ప్రగతిలో భాగంగా ప్రభుత్వం ప్రతి జీపీకి నెలనెలా నిధులు మంజూరు చేస్తున్నా.. మురుగు వ్యవస్థను మెరుగు పరచడానికి సర్పంచు, గ్రామ కార్యదర్శి నిర్లక్ష్యం చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. మురికికాల్వలు ఉన్న చోట వాటిని పట్టించుకోక పోవడంతో మట్టి, చెత్తా, చెదారం పేరుకుపోయి నీరు రోడ్లపైకి చేరుతోంది. ఫలితంగా దోమలు, ఈగలు విజృంభించి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. అంతర్గత రోడ్లపై పారుతున్న మురుగునీటిని నివారించేందుకు రోడ్లకు ఇరువైపులా మురికి కాల్వలను నిర్మించాల్సి ఉంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి మురుగు కాలువల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేడు బీజేపీ సమావేశం

బొంరాస్‌పేట: మండల పరిధిలోని తుంకిమెట్లలో సోమవారం బీజేపీ కార్నర్ సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు సీహెచ్ నర్సింహులు తెలిపారు. గ్రామంలో ఉదయం 11గంటలకు జరిగే సమావేశంలో పలు అంశాలపై చర్చించి, తీర్మానాలు చేయనున్నట్లు చెప్పారు. బీఆర్ఎస్ చేస్తున్న అరాచకాలను ఎండగట్టి, బీజేపీ చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నామని వెల్లడించారు. సమావేశానికి పాలక్ మల్లారెడ్డి, శ్రీరాములు, తాలూకా కన్వీనర్ నర్సింహులు, జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి హాజరవుతారని చెప్పారు.

మల్కాపూర్‌లో..

తాండూరు రూరల్: పార్టీ ఆదేశాల మేరకు మల్కాపూర్ గ్రామంలో ప్రజాగోస–బీజేపీ భరోసా కార్యక్రమం నిర్వహించనున్నట్లు భాజపా మండల అధ్యక్షుడు శేఖాపూరం అంజనేయులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు మల్కాపూర్, కోత్లాపూర్, సంగెంకలాన్ గ్రామాలకు చెందిన శక్తి కేంద్ర కార్నర్ మీటింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు సందానందారెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్ కుమార్‌లు హాజరుకానున్నారని చెప్పారు.

పేద కుటుంబానికి అండగా..



ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న గ్రామస్తులు

పరిగి: మండల పరిధిలోని మాదారం గ్రామానికి చెందిన శేరి రంగారెడ్డి నిరుపేద కుటుంబం బతుకుదేరువు కోసం సంగారెడ్డి జిల్లా సదాశివపేటకు వలస వెళ్లారు. సొంత గ్రామమైన మాదారంలో నివసించాలనుకున్న రంగారెడ్డి.. సర్పంచ్ రాములు, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు మహేందర్‌కు తమ ఆర్థిక పరిస్థితిని వివరించారు. దీంతో రంగారెడ్డికి తమ సొంత ఖర్చుతో ఇళ్లు నిర్మించి ఇవ్వాలని గ్రామపెద్దలు నిర్ణయించారు. ఇందులో భాగంగా ఆదివారం ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేశారు. సొంత డబ్బుతో పేద కుటుంబానికి ఇల్లు కట్టిస్తుండటంతో పలువురు అభినందించారు. అనంతరం దాతలు మాట్లాడుతూ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి బాటలో నడుస్తామని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు సాయిరాం, సత్యనారాయణరెడ్డి, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారులను దిగ్బంధిస్తాం

షాద్‌నగర్‌టౌన్: ఎమ్మార్పీఎస్ ఏబీసీడీ వర్గీకరణ సాధనలో భాగంగా నేడు(సోమవారం) హైదరాబాద్, విజయవాడ జాతీయ రహదారులను దిగ్బంధం చేసి తీరుతామని మహాజన సోషలిస్టు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చిన్నోళ్ల అనంతయ్య ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన 100రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పిస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. నరేంద్రమోడీకి మందకృష్ణ మాదిగ పలుమార్లు వినతులను ఇచ్చినా చట్టబద్ధత విషయంలో న్యాయం జరగలేదని ఆరోపించారు. వర్గీకరణ బిల్లుకు అన్ని పార్టీలు మద్దతు ప్రకటించినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరిపించడానికే జాతీయ రహదారులను దిగ్బంధం చేసేందుకు మాదిగలు సిద్ధమయ్యారని చెప్పారు. రాబోయే రోజుల్లో ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

కొడంగల్: రెండు దశాబ్దాల అనంతరం కలుసుకున్న ఆ మిత్రం బృందం తాము చదువుకున్న పాఠశాల ఆవరణలో సందడి చేశారు. నాడు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులతో స్నేహితులంతా ఆత్మీయ అనురాగం పంచుకున్నారు. పట్టణానికి చెందిన ఉన్నత పాఠశాల 2001–2002 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకొన్నారు. పట్టణంలోని పంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కుటుంబ సభ్యులతో కలుసుకున్నారు. నాటి తీపి జ్ఞాపకాలకు నెమరు వేసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు. సంతోష్, రాములు గౌడ్, ఖదీర్, ఆవుల బాలప్రకాశ్, ఉపాధ్యాయులు అనసూయ, పద్మ, నిర్మల, మూర్తి పాల్గొన్నారు.

ఘనంగా మల్లన్న బోనాల ఉత్సవాలు



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

చేవెళ్ల: మండలంలోని ఖానాపూర్ గ్రామంలో ప్రజలు భక్తి శ్రద్ధలతో మల్లన్న బోనాల ఉత్సవాలను జరుపుకొన్నారు. ఆదివారం గ్రామ ప్రజలు పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, డప్పు వాయిద్యాలతో మహిళలు బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా మల్లన్న సన్నిధికి వెళ్లారు. ఆలయ చుట్టూ ప్రదక్షిణలు చేసి మల్లన్న బోనం సమర్పించారు. కురుమ సంఘం నాయకులు మల్లన్న బోనాల ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీలత, కురుమ సంఘం మండల నాయకులు కసిరే వెంకటేశ్, గ్రామ సంఘం నాయకులు కృష్ణ, అంజనేయులు, మహేందర్, గ్రామపెద్దలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు

ఘనంగా బొడ్రాయి పండుగ

కొత్తూరు: కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని స్టేషన్ తిమ్మాపూర్ గ్రామంలో ఆదివారం బొడ్రాయి పండుగను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రజలు బోనాలు ఊరేగించి బొడ్రాయికి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం స్థానిక నాయకులు బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాయకులు డోలీ రవీందర్, వస్పుల మహేందర్, శ్రీధర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రోత్సహించేందుకే క్రీడా పోటీలు



యాలాల: విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న శుభప్రద్ పటేల్



నవాబుపేట: క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్‌పటేల్

యాలాల: యువతను ప్రోత్సహించేందుకే క్రీడా పోటీలు నిర్వహించామని రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని లక్ష్మీనారాయణపూర్‌లో 12 రోజులుగా నిర్వహిస్తున్న కేసీఆర్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్‌లో ముఖ్య అతిథులుగా గొర్రెలు, మేకల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ దూదిమెట్ల బాలరాజ్, ఆర్‌టీఐ రాష్ట్ర కమిషనర్ మహ్మద్ అమీర్‌లు పాల్గొని పోటీలు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఫైనల్‌లో బంజార, సిటిజన్ కౌన్సిల్ మధ్య పోటీ నెలకొనగా.. సిటిజన్ కౌన్సిల్ జట్టు విన్నర్‌గా నిలిచింది. విజేతగా నిలిచిన జట్టుకు ట్రోఫీతో పాటు రూ.25 వేలు అందజేశారు. కార్యక్రమంలో తాండూరు మున్సిపల్ చైర్మన్ స్వప్న పరిమళ్, మైనార్టీ నాయకులు ముస్తఫా, అబ్దుల్ వాహబ్, సర్పంచ్ శివకుమార్, శుభప్రద్ యువసేన సభ్యులు భానుప్రసాద్, కుర్వబాలు, రాము, శ్రీశైలం, హరీశ్, విజయ్ తదితరులు ఉన్నారు.

క్రీడలతో మంచి భవిష్యత్

నవాబుపేట: ఆటలతో యువతకు మంచి భవిష్యత్తు ఉంటుందని సామాజిక కార్యకర్త జేబీ బాలరాజు అన్నారు. మండల పరిధిలోని మూలమడ గ్రామంలో వారం రోజులుగా బాలరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ టోర్నీలో 32 జట్లు పాల్గొన్నాయి. ఆదివారం నాటి ఫైనల్లో పోటీల్లో మూలమాడకు చెందిన జట్టు మొదటి స్థానంలో నిలవగా.. ఎక్మామిడికి చెందిన జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. మొదటి బహుమతిగా రూ.30 వేల నగదు, రెండో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.15వేల నగదు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకే ఈ టోర్నీ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మూలమాడ సర్పంచ్ సుభాన్ రెడ్డి, ఉపసర్పంచ్ శ్రీనివాస్ యాదవ్, నాయకులు, వివిధ గ్రామాలకు చెందిన యువకులు తదితరులు పాల్గొన్నారు

సమస్యల పరిష్కారమే లక్ష్యం

ప్రతి సోమవారం ప్రజావాణి: తహసీల్దార్లు

బొంరాస్‌పేట: బొంరాస్‌పేట, దుద్యాల పరిధిలోని భూ సమస్యలు, ధరణి దరఖాస్తులను పరిష్కరించేందుకు ప్రతి సోమవారం ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్లు షర్మిళ, భీమయ్యలు తెలిపారు. ప్రతి సోమవారం కార్యాలయంలో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు భూ సంబంధ అర్జీలు, సమస్యలు స్వీకరించి పరిష్కరిస్తామని చెప్పారు. ఈ సదుపాయాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్లు సూచించారు.

పెద్దేముల్: తహసీల్దార్ కార్యాలయంలో నేడు ప్రజావాణి నిర్వహిస్తామని మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్‌ఐ) రాజిరెడ్డి తెలిపారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజావాణిలో ధరణి, భూ సమస్యలపై ఫిర్యాదులు తీసుకోవడం జరుగుతుందన్నారు.

తాండూరులో..

తాండూరు రూరల్: తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ చిన్నప్పల నాయుడు ఆదివారం ఒక ప్రకటలో పేర్కొన్నారు. సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రజావాణి నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భూములకు సంబంధించిన సమస్యలతో పాటు ధరణి పోర్టల్‌పై ఏమైనా సమస్యలు ఉంటే ఫిర్యాదు చేయాలన్నారు. కలెక్టర్ నారాయణ రెడ్డి ఆదేశాల మేరకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున మండల ప్రజలు ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

14న సంత్ సేవాలాల్ జయంతి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

అనంతగిరి: ఈనెల 14న పరిగి పట్టణంలో అఖిల భారత గిరిజన సమాఖ్య(ఏఐటీఎఫ్) రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో సంత్ సేవాలాల్ మహరాజ్ 284వ జయంతిని పురస్కరించుకుని వేడుకలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాఘవన్‌నాయక్ తెలిపారు. ఈమేరకు ఆదివారం వికారాబాద్‌లో వాల్‌పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. సంత్ సేవాలాల్ అడుగు జాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. ఉత్సవాలు పరిగిలోని బృందావన్ గార్డెన్‌లో ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్యామలతా, జిల్లా కన్వీనర్ ధరంసింగ్, జిల్లా కార్యదర్శి దశరథ్, మాజీ ఏఎంసీ మెంబర్ రమేష్‌నాయక్, లగోరి అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరిక

జెడ్పీ వైస్‌చైర్మన్ గణేశ్



గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న గణేశ్, రవీందర్‌యాదవ్

నందిగామ: బీఆర్ఎస్ ప్రభుత్వం, ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని జెడ్పీవైస్ చైర్మన్ గణేశ్ అన్నారు. మండల పరిధిలోని మొదళ్లగూడ గ్రామానికి వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఆదివారం ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ నివాసంలో ఎంపీపీ రవీందర్‌యాదవ్, గణేశ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా గణేశ్ మాట్లాడుతూ.. దేశంలో ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలు తెలంగాణలో అమలు చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. షాద్‌నగర్ నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసిన ఘనత ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌కే సొంతమని వెల్లడించారు. రోడ్లు, భవనాలు, డబుల్ బెడ్ రూం ఇళ్లు, ప్రభుత్వ ఆస్పత్రి తదితర అభివృద్ధి పనులు నియోజకవర్గంలో జోరుగా సాగుతున్నాయన్నారు. పార్టీలో చేరిన వారిలో ముస్తఫా, ఇంద్రసేనారెడ్డి, రామకృష్ణ, హబీబ్, సజా ఉద్దీన్, పోచయ్య, రాములు, చంద్రయ్య, రెహ్మాన్, కరీం తదితరులు ఉన్నారు.

పొగమంచు కాదు.. దుమ్ముధూళి



దుమ్ము లేపుతూ దూసుకెళ్తున్న కారు

కరన్‌కోట్ వెళ్లాలంటే ఈ మార్గమే దిక్కు

తాండూరు రూరల్: ఇక్కడ కనిపిస్తున్న చిత్రంలో పొగమంచులో కారు దూసుకెళ్తుందని అనుకుంటున్నారా? కానేకాదు.. అదంతా దుమ్ముధూళే. కరన్‌కోట్ వెళ్లాలంటే ఈ మార్గమే పరిసర ప్రాంత గ్రామాల ప్రజలకు దిక్కు. ఆ గ్రామానికి వెళ్లాలంటే ఊపిరి బిగపట్టుకొని ప్రయాణించాల్సిందే. గౌతంనగర్ చెక్‌పోస్టు నుంచి గోపన్‌పల్లి శివారు వరకు రోడ్డు ధ్వంసమైంది. ఈ రోడ్డు మరమ్మతుకు నిధులు కూడా మంజూరయ్యాయి. పనులు దక్కించుకున్న సదరు కాంట్రాక్టర్ మట్టిపోసి వదిలేశారు. మట్టిపోసి నాలుగు నెలలు గడుస్తున్నా.. మట్టిపై కంకర పరచడం లేదు. దీంతో ఆ రోడ్డుపై ప్రయాణించాలంటే ఇలా దుమ్ముధూళిని భరించాల్సిందే. గాలిలో లేస్తున్న దుమ్ముతో వెనకాముందు వచ్చే వాహనాలు కనబడక పోవడంతో ప్రమాదాలకు ఆస్కారం లేకపోలేదని స్థానికులు చెబుతున్నారు. కరన్‌కోట్, ఓగిపూర్, గోపన్‌పల్లి, బెల్కటూర్, చిట్టిఘనాపూర్, చంద్రవంచతో గ్రామస్తులు ఈ మట్టిరోడ్డుపై పయనిస్తూ.. నరకం చూస్తున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి.. రోడ్డు పనులు చేపట్టేందుకు తగిన చర్యలు చేపట్టాలని బాధిత గ్రామాల ప్రజలు కోరుతున్నారు.